## 13

# శ్రీశేషుదేవుల స్వభావము అద్దమువలె స్వచ్ఛముగా ఉండేది

శ్రీ శేషుబాబు గారిలోని ఒక విచిత్రమైన స్వభావాన్ని ఇక్కడ మనం స్మరించుకోవాలి. శ్రీ శేషుబాబు గారి స్వభావము స్వచ్ఛమైన అద్దము వలె ఉండేది. శ్రీ శేషుబాబు గారు ఎప్పుడు ఏ వ్యక్తితో సాంగత్యము చేస్తే, ఆవ్యక్తి శ్రీ శేషుబాబులో తన స్వభావమునే చూచేవాడు. వాక్చాతుర్యముతో వాదించే వానికి శ్రీ శేషుబాబు గారు తనకంటే వాక్చతురునిగా కనిపించేవారు. ధైర్యస్తునికి తనకంటే ధైర్యస్తునిగాను, పిరికి వానికి తనలాంటి పిరికివాని గాను, మేధావికి మేధావిగాను, తెలివితక్కువ వానికి తెలివితక్కువవాని గాను కనిపించేవారు.

అలాగే శ్రీ శేషుబాబుగారి స్వభావము పాదరసములాగ దేనికీ అంటకుండా ఉండేది. పాదరసాన్ని ఏ ఆకారపు పాత్రలో పోస్తే ఆ ఆకారములోనే కనిపించినట్లుగ, శ్రీ శేషుబాబు గారు ఏ వ్యక్తితో సాంగత్యము చేసినా ఆ వ్యక్తికుండే బలహీనతలే తనకు ఉన్నట్లుగను, తమ ఇరువురిది ఒకే స్థాయి అన్నట్లుగను కనిపించేవారు. ఆయన అలాగ నటించేవారు కాదు. నిజముగనే అదే స్వభావము, అవే ఆలోచనలు ఉన్నట్లుగా మారిపోయేవారు. ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యము అనే మూడు శక్తులు సంపూర్ణముగా మేల్కొనియున్న సద్గురుదేవులగు శ్రీ శేషుబాబు గారిలో ఎట్టి సంస్కారములు గానీ స్థూలశరీరముగానీ ఉండవు. అందువల్లనే ఆయన ఎవరితో కలిస్తే వారి సంస్కార రూపమే తమ రూపములాగ కనిపించేవారు. ఈ విషయమై ఒకసారి శ్రీ శేషుబాబు గారు ఇలా చెప్పియున్నారు.

“నేనెంతో పెద్దవాడినైనప్పటికీ మీకోసమే మీ స్థాయికి దిగి వచ్చే వాడిని. మీలో ఉన్న బలహీనతలు నాతో చెప్పుకుని, వాటినుండి విముక్తి పొందుటకై మీరు సిగ్గుపడరాదని, కించపరచుకోరాదని భావించేవాడిని. అందుకే మీకేవైతే బలహీనతలు ఉన్నాయో అవే బలహీనతలు నాకు కూడా ఉన్నట్లుగా మీతో కలసిపోయేవాడిని. నిజానికి నేను చాలా పెద్దవాడిని. ఈ యుగములోనే భగవంతుడు మేల్కొనటానికి అనువైనదిగా ఈ ఆత్మను ఎంచుకున్నారంటే ఎంత పెద్దవాడినో ఆలోచించుకోండి” అని శ్రీ శేషుబాబు గారు చెప్పియున్నారు.

